తనిఖీల నివేదికలు అందజేయాలి

● సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలను తనిఖీ చేయండి : కలెక్టర్

7

ఇనగలూరులో భగ్గుమన్న పాతకక్షలు

బైకుపై వెళ్తున్న అన్నదమ్ములను కారుతో ఢీకొట్టి.. కత్తులు, కట్టెలతో దాడి

పచ్చదనం-పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

● స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర ర్యాలీలో కలెక్టర్



ర్యాలీలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటిటౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చదనం-పరిశుభ్రత పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రాయచోటి మున్సిపల్ కార్యాలయం నుంచి నేతాజీ సర్కిల్ వరకు చేపట్టిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ప్లాస్టిక్ వద్దు- కాటన్ ముద్దు, పచ్చదనం పెంచుదాం అనే నినాదాలతో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది ప్రభుత్వానిదే కాదు ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో, గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకం, వాటి వల్ల కలిగే అనర్థాలను గుర్తించి ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. ప్రతి ఒక్కరూ కాటన్ కవర్లను వాడాలని ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. అనంతరం మున్సిపల్ సిబ్బందిని సన్మానించి వారికి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, తహసీల్దార్ నరసింహకుమార్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కోదండరాముడికి స్నపన తిరుమంజనం



సుగంధ ద్రవ్యాలను తెస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరాముడికి శనివారం స్నపన తిరుమంజనం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్‌స్వామి వారి అభిషేకానికి సుగంధ ద్రవ్యాలను, పట్టువస్త్రాలు, పుష్పాలను అందజేశారు. మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు వీణా రాఘవాచార్యులు, మనోజ్‌కుమార్ అభిషేకం చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, భక్తులు పసుపులేటి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కోలో మాయ...!

● ట్రాన్స్‌ఫార్మర్ కోరితే.. మీటర్‌తో సరిపెట్టారు

● రూ.2 లక్షలు వసూలు చేసి.. రూ.12,500తో పని కానిచ్చేశారు..

● మిగిలిన రూ.1,87,500 ఎవరి జేబులోకి చేరినట్లు..?

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఏ ప్రభుత్వ శాఖ అయినా ప్రభుత్వానికి ఆదాయం పెంచేందుకు శాయశక్తులా ప్రయత్నించాలి. అయితే ట్రాన్స్‌కో శాఖ రాయచోటి డివిజన్ పరిధిలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. నాకు 63 కిలోవాట్ల ట్రాన్స్‌ఫార్మర్ కావాలి.. అందుకు అవసరమైన డబ్బు చెల్లిస్తానని ఓ వినియోగదారుడు ముందుకొస్తే విద్యుత్ అధికారులు అతడికి 6 కేవీ మీటర్ మాత్రమే ఏర్పాటు చేశారు. వినియోగదారుడి వద్ద నుంచి వసూలు చేసిన రూ.2 లక్షల్లో కేవలం రూ.12,500 మాత్రమే ఖర్చు చేసి మిగిలిన మొత్తాన్ని తమ జేబులోకి వేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

రాయచోటి పట్టణంలో యశోద హాస్పిటల్‌కు కమర్షియల్ కేటగిరీ-2 కింద (సర్వీసు నెంబరు 2411201002866) విద్యుత్ కనెక్షన్ ఉంది. అయితే ఆసుపత్రిలో అవసరమైన విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని హాస్పిటల్ యజమాని ఈ ఏడాది ఫిబ్రవరి 18న 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, 30 కేవీ సిటి మీటర్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం.. 11 కేవీ లైన్ లాగడం కోసం అధికారులు ఫిబ్రవరి 22న ఎస్టిమేషన్ (ఎస్టిమేషన్ నెంబరు ఇ-2024-06-04-11-02-080) వేశారు. హాస్పిటల్ యాజమాన్యం కూడా హాస్పిటల్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ కోసం దిమ్మెను సిద్ధం చేసుకున్నారు. ఎస్టిమేషన్ వేసిన తర్వాత ఏఈ, డీఈ, ఈఈ స్థాయిలలో పరిశీలన తర్వాత ఒకవేళ వినియోగదారుడు కనెక్షన్ కోసం ముందుకు రాకపోయినా ఆ ఎస్టిమేషన్ రద్దు



ఆసుపత్రి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఏర్పాటు చేసిన దిమ్మె

అవుతుంది. అదే వినియోగదారుడు ఎస్టిమేషన్‌లో పేర్కొన్న మేరకు డబ్బు చెల్లిస్తే.. నెలలోపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి, కనెక్షన్ ఇచ్చేస్తారు. అయితే ఇక్కడ ఫిబ్రవరిలో ఎస్టిమేషన్ వేస్తే జూలై వరకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడం, ఇప్పటికీ ఆ ఎస్టిమేషన్‌ను రద్దు చేయకపోవడం వెనుక వసూళ్ల బాగోతం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు లంచాలకు అలవాటుపడిన అధికారులు ఇలా ఆసుపత్రులు, ఇంకా పెద్ద సంస్థలు ఏవైనా కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే.. తమకు రావాల్సిన కమీషన్లు వచ్చే వరకు పని జరగనీయరనే ఆరోపణలు విద్యుత్ శాఖలో జోరుగా వినిపిస్తున్నాయి.

ఇలాగే ఇక్కడ కూడా ఫిబ్రవరి నుంచి మామూళ్ల వ్యవహారం తేలే వరకు ఆలస్యం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ట్రాన్స్‌కో పడమర విభాగంలో పనిచేసే ఓ చిన్న ఉద్యోగి పెద్ద ఉద్యోగి డైరెక్షన్‌లో గత నెల ఆసుపత్రి డాక్టర్ నుంచి రూ.2 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. ముందు మీరు రూ.2 లక్షలు ఇవ్వండి.. మిగిలింది ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేటపుడు ఇవ్వవచ్చని ఆ విద్యుత్ ఉద్యోగి చెప్పినట్లు సమాచారం. అయితే ఎస్టిమేషన్‌లో పేర్కొన్న ప్రకారం డాక్టర్‌కు చెప్పిన ప్రకారం.. 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, 30 కేవీ సిటి మీటర్‌ను ఏర్పాటు చేయలేదు. ఆసుపత్రి సమీపంలో ఉన్న పబ్లిక్ లైను నుంచే కేటగిరి-1 6 కేవీ మీటర్‌ను ((సర్వీసు నెంబరు 2411201037593) ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. ఇందుకు రూ.12,500 మాత్రమే ఖర్చు అయినట్లు ఆ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. కేవలం రూ.12,500 మాత్రమే ఖర్చు చేసి మిగిలిన రూ.1,87,500 జేబులో వేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తనకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయమంటే.. కేవలం మీటర్ మాత్రమే ఏర్పాటు చేస్తే ఎలా అని విద్యుత్ సిబ్బందిపై ఆసుపత్రి డాక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. అయినా విద్యుత్ అధికారులు డాక్టర్ ఇబ్బందిని పట్టించుకోకుండా మీకు మీటర్ ఏర్పాటు చేశాం.. కదా.. ఇంకేం అంటూ.. తప్పించుకుంటున్నట్లు ప్రచారంలో ఉంది. సాధారణంగా ఎస్టిమేషన్ ప్రకారం.. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి ఉంటే.. ప్రభుత్వానికి సుమారు రూ.5 లక్షల వరకు ఆదాయం వచ్చి ఉండేది. 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.3 లక్షలు, 30 కేవీ సిటి మీటర్ కోసం రూ.90 వేలు డిపాజిట్, 11 కేవీ లైను లాగడానికి, పిల్లర్‌ను ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడానికి సుమారు లక్ష వరకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే విద్యుత్ శాఖలోని లంచావతారుల వల్ల ప్రభుత్వానికి సుమారు ఐదు లక్షల వరకు ఆదాయానికి గండిపడిందనే చెప్పవచ్చు. అయితే ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం వస్తున్న విషయం తెలిసి.. తాము ఎవరి దగ్గరా డబ్బు వసూలు చేయలేదని, వినియోగదారుడే తనకు ట్రాన్స్‌ఫార్మర్ వద్దు.. మీటర్ చాలని చెప్పడంతో..మీటర్ ఏర్పాటు చేసినట్లు చెబుతుండటం విశేషం.



63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కోసం అధికారులు తయారు చేసిన ఎస్టిమేషన్

లంచావతారుల జోరు

విద్యుత్ శాఖలో కొందరు అధికారుల ఆగడాలు ఎక్కువ అయ్యాయనే ఆరోపణలు జోరుగా ఉన్నాయి. ఎంతటి చిన్నపనైనా.. తమ చేయి తడపందే.. పనులు చేయరని పలువురు ఆరోపిస్తున్నారు. హాస్పిటల్ విషయం మచ్చుకు మాత్రమేనని, ఇంకా వెలుగులోకి రానివి ఎన్నో ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇందులో కింది స్థాయి నుంచి అన్ని స్థాయి అధికారుల వరకు డబ్బు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వినియోగదారుడే వద్దన్నాడు

లోడు అవసరం లేదని, వినియోగదారుడే ట్రాన్స్‌ఫార్మర్ వద్దన్నాడు. కాబట్టే 6 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశాము. రెండు లక్షల రూపాయలు ఎవరూ వసూలు చేయలేదు.

- లక్షుమయ్య, ఏఈ వెస్ట్

కలికిరి సబ్ రిజిస్ట్రారుపై విచారణ

● విచారణాధికారిగా చిత్తూరు జిల్లా రిజిస్ట్రారు

కలికిరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కలికిరి సబ్ రిజిస్ట్రారు పార్థసారథిపై వచ్చిన వివిధ రకాల ఆరోపణలపై శనివారం చిత్తూరు జిల్లా రిజిస్ట్రారు ఏవీఆర్ మూర్తి విచారణ చేశారు. మధ్యాహ్నం 1.45 నుంచి మూడు గంటల వరకు ఆయన విచారించారు. పదుల సంఖ్యలో సబ్ రిజిస్ట్రారు బాధిత రైతులు ఆధారాలతో సహా సబ్ రిజిస్ట్రారు తమను వేధించిన విధానాలను విచారణాధికారి ముందు ఏకరువు పెట్టారు. డాక్యుమెంట్ రైటర్లు చేస్తున్న ఆరోపణలు లెక్కకు మించిపోయాయి. ఈ సందర్భంగా వివాహ ధ్రువపత్రం కోసం పదో తరగతి చదివిన ఒక మహిళ చిన్నబిడ్డతో సహా హాజరై సబ్ రిజిస్ట్రారు ముందు వేడుకుంటున్న సంఘటనకు సంబంధించిన వీడియోను చూసిన జిల్లా రిజిస్ట్రారు అవాక్కయ్యారు. వివాహ సర్టిఫికెట్ కోసం పదో తరగతి టీసీ అందజేసినా ఇది చెల్లదని పదో తరగతి మార్కుల జాబితా కావాలని సబ్ రిజిస్ట్రారు పట్టుబట్టడాన్ని



డాక్యుమెంట్ రైటర్ల వాదనలు వింటున్న విచారణాధికారి ఏవీఆర్ మూర్తి

చూసి విచారణాధికారి అసహనం వ్యక్తం చేశారు. పరిస్థితిని గమనించిన సబ్ రిజిస్ట్రారు పార్థసారథి తాను చాలా సౌమ్యుడినని, తన కంఠం అలా పరుషంగా కఠినంగా ఉంటుందని సమాధాన పర్చేందుకు ప్రయత్నించారు. అసలు ఇండియన్ మ్యారేజి యాక్టు, ఇండియన్ స్పెషల్ మ్యారేజి యాక్టుల సంవత్సరాలు చెప్పమంటే చెప్పలేక నీళ్లు నమిలారు. తండ్రి చనిపోతే తల్లికి చెందిన ఆస్తిని రిజిస్టరు చేయడానికి ఆటంకమేమిటని ప్రశ్నించారు. అసలు ఆఫీసులో ఎవరికైనా నియమాలు తెలుసా అంటూ పదే పదే అడిగారు. ప్రతి రిజిస్ట్రేషన్‌కు ఏదో ఒక వంకలు పెట్టి రూ.పది వేల నుంచి 50 వేల వరకూ డిమాండు చేస్తున్నారని రైతులు మూకుమ్మడిగా వాపోయారు. ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయని ఇంకోరోజు ముందుగా సమాచారమిచ్చి అన్నింటిపైనా సమగ్రంగా విచారణ జరుపుతానని హామీ ఇచ్చారు. సాయంత్రం 4 గంటలకు చిత్తూరులో ముఖ్యమైన విచారణ ఉన్న కారణంగా జిల్లా రిజిస్ట్రారు రైతులందరికీ నచ్చజెప్పి విచారణను అర్ధంతరంగా ముగించారు. తొలిరోజు విచారణకు సబ్ రిజిస్ట్రారు పార్థసారథి, కార్యాలయ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు, పదుల సంఖ్యలో రైతులు హాజరయ్యారు.

నెల రోజుల్లో సమస్యలన్నింటికీ పరిష్కారం

● టీడీపీ జోన్-4 ఇన్‌చార్జి దీపక్‌రెడ్డి

మదనపల్లె టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ టీడీపీలో అంతర్గత సమస్యలన్నింటినీ నెల రోజుల్లో పరిష్కరిస్తామని టీడీపీ జోనల్-4 ఇన్‌చార్జి దీపక్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక దేవతానగర్‌లోని కార్యాలయంలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అధ్యక్షతన నియోజకవర్గంలోని క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నేతలు సమస్యలను ఏకరువు పెట్టారు. పేరుకే అధికార పార్టీ నేతలమని ఎక్కడా తమ పనులు జరగడం లేద న్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వ అధికారుల వద్దకు వెళితే కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ బలోపేతానికి 20 ఏళ్లకు పైగా పనిచేసిన వారికి గుర్తింపు లేకుండా పోయిందన్నారు. వీటిపై దీపక్‌రెడ్డి మాట్లాడుతూ పాత వారినందరినీ కలుపుకునిపోవాలని సూచనలిచ్చారు. నెల రోజుల్లో పార్టీలో అందరికీ గుర్తింపు ఇస్తూ గ్రామ, మండల, పట్టణ కమిటీలను ఎంపిక చేస్తామన్నారు. మదనపల్లె నియోజకవర్గ పరిశీలకులు నెల రోజులు మదనపల్లెలోనే అందుబాటులో ఉండి సమస్యలను వింటారన్నారు. చమర్తి జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ కార్యకర్తల మనోభావాల మేరకు గ్రామ కమిటీలు ఎంపిక చేస్తామని, ఈ కమిటీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మండల కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మదనపల్లె పట్టణం, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండల అధ్యక్ష పదవి కోరుతున్న వారి వివరాలు, ఎంత కాలంగా పనిచేస్తున్నారు, ఏయే పదవుల్లో ఉన్నారన్న వివరాలు నమోదు చేసుకున్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు చమర్తి సురేష్‌రాజు, గురుమూర్తిగౌడ్, మల్లికార్జునరెడ్డి, నేతలు విద్యాసాగర్, ఆర్‌కే రామకృష్ణాచారి, ఆర్‌జే వెంకటేశ్, చల్లా నరసింహులు, భవానీప్రసాద్, దేవరింటి శ్రీనివాసులు, విజయకుమార్‌గౌడ్, పి.వెంకటరమణ, ఎస్.సుధాకర్, సహదేవ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో జోనల్-4 ఇన్‌చార్జి దీపక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, తదితరులు

రైతు బిడ్డకు రాష్ట్రపతి ప్రశంస

● సీఎంఏలో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు

● పట్టుదల, ప్రణాళికాబద్ధంగా చదవడంతోనే..

● రాష్ట్రపతి, సీఎం నుంచి ప్రశంసలు

తంబళ్లపల్లె, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చార్టెడ్ అకౌంటెన్సీ (సీఏ) కోర్సులో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉంటుందని, రాణించడం కష్టమని చాలామంది వెనకడుగు వేస్తుంటారు. అలాంటి కోర్సు చదవాలని చిన్నపుడే లక్ష్యంగా నిర్ణయించుకుంది రైతు బిడ్డ తేజశ్విని. కృషి, పట్టుదల, ప్రణాళికతో చదివి సీఎంఏలో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించింది. ఇటీవల ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా ఐసీఏఐ పట్టా అందుకుని శభాష్ తేజశ్విని అనిపించుకుంది. తన విజయానికి తల్లితండ్రుల ప్రోత్సాహంతో పాటు, పట్టుదల, ప్రణాళికాబద్ధంగా చదవడమే కీలకమని చెబుతున్న తేజశ్విని విజయగాథ ఆమె మాటల్లోనే...

మాది అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు గ్రామం. గ్రామంలోని అన్ని కుటుంబాలకు చాలా వరకు వ్యవసాయమే ప్రధాన వృత్తి. నాన్న కొత్తపేట రఘురామిరెడ్డి, అమ్మ నాగవేణి. ఇద్దరూ వ్యవసాయం చేస్తూ మమ్మల్ని ఉన్నత చదువులు చదివించారు. అమ్మ, నాన్నలకు ముగ్గురు సంతానం. కాగా నేను పెద్దమ్మాయిని. చెల్లెలు ఇందు ప్రస్తుతం ఎంసీఏ చదువుతుండగా, తమ్ముడు ఈ ఏడాది బీటెక్‌లో చేరాడు. పిల్లలందరినీ మంచి చదువులు చదివించి ఉన్నత స్థానంలో చూడాలన్నదే అమ్మనాన్న కోరిక. అందుకోసం వారు ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడ్డా.. అవేవీ చెప్పకుండా మా చదువులకు ప్రోత్సాహం అందించారు.



జూన్ 23న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఐసీఏఐ పట్టా అందుకుంటున్న తేజశ్విని

పది, ఇంటర్‌లో 10/10

నా ప్రాథమిక విద్య 5వ తరగతి వరకు తంబళ్లపల్లెలోని ఆదర్శ పాఠశాలలో సాగింది. ఆ తర్వాత నవోదయ ఎంట్రెన్స్ రాసి మదనపల్లెలోని వలసపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో చేరాను. 2017లో పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించాను. 2019 లో ఇంటర్ ఎంఈసీ గ్రూపులో 10/10 జీపీఏ మార్కులతో ఉత్తీర్ణత సాధించాను.

చిన్నతనం నుంచే సీఏ లక్ష్యం

చిన్నతనం నుంచే సీఏ చేయాలనే లక్ష్యం బలంగా ఉండేది. ఇందుకు అమ్మానాన్నల ప్రోత్సాహం తోడవడంతో తిరుపతిలోని ఓ కాలేజీలో సీఏలో చేరాను. హాస్టల్‌లో ఉంటూ లక్ష్యానికి తగ్గట్టుగా పట్టుదలగా చదువుతూ ప్రిపరేషన్ ప్రారంభించాను. మంచి ర్యాంకు సాధించాలన్న ఆశయంతో చివరి ఆరు నెలలు రోజుకు 12 నుంచి 14 గంటలు చదువుపై దృష్టి పెట్టా. ఈ లక్ష్యంతోనే 2024లో జూలైలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) విడుదల చేసిన సీఏ ఫైనల్ ఫలితాల్లో ఆలిండియా 14వ ర్యాంకు సాధించాను. ఆ తర్వాత 2024 ఆగస్టులో సర్టిఫైడ్ మేనేజ్‌మెంట్ (సీఎంఏ) ఫైనల్ ఫలితాల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు రావడంతో తల్లిదండ్రుల కష్టానికి ప్రతిఫలం దక్కిందని చాలా సంతోషపడ్డా.



గత ఏడాది అక్టోబరు 16న సీఎం చంద్రబాబు నుంచి ప్రశంసలు అందుకుంటున్న తేజశ్విని

రాష్ట్రపతి, సీఎం ప్రశంసలు

సీఏలో ఆలిండియా మొదటి ర్యాంకు సాధించడంతో జూన్ 23న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అమ్మనాన్నలతో కలసి ఐసీఏఐ పట్టాతో పాటు మెడల్స్ అందుకోవడం ఓ అద్భుతం. అదేవిధంగా, గత ఏడాది అక్టోబరు 16న ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబునాయుడు 'శభాష్ తేజశ్విని' అని తల్లితండ్రులు, చిన్నాన్న ముందు ప్రశంసించడం చాలా గర్వంగా ఉంది. ఈ రెండు అద్భుత క్షణాలను జీవితంలో ఎప్పటికీ మరచిపోలేను.




పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా చదవాలి

సీఏ చదివేందుకు టాలెంట్, తెలివితేటలు బాగా ఉండాలని ఏమి లేదు. పట్టుదల, కష్టపడేతత్వం, ప్రణాళికాబద్ధమైన విద్యాభ్యాసం, సమయపాలన వంటి విజయ రహస్యాలను అవగాహన చేసుకుంటే ఎవరైనా సీఏ కోర్సులో విజయం సాధించవచ్చు. అమ్మనాన్నల ప్రోత్సాహానికి తోడు ఈ విజయ రహస్యాలే నాకు సీఏ ఆలిండియా మొదటి ర్యాంకును తెచ్చిపెట్టాయి. ప్రస్తుతం బెంగళూరులో యాక్సెంచర్ కంపెనీలో మంచి ప్యాకేజీతో జాబ్ చేస్తున్నాను. సీఏ చేసిన వారికి ఫైనాన్స్, ఆడిట్, అకౌంట్స్, డైరెక్ట్ ట్యాక్స్, ఇన్ డైరెక్ట్ ట్యాక్స్, డేటా అనాలసిస్ వంటి విభాగాల్లో మన ఇంట్రస్ట్‌ను బట్టి ఉద్యోగాలు ఉంటాయి. అయితే భవిష్యత్తులో వీలైతే చార్టెడ్ ఫైనాన్సియల్ అనలిస్ట్ (సీఎఫ్ఏ) కోర్సు చేద్దామని అనుకుంటున్నాను. ఇప్పటికైతే అమ్మ, నాన్నలను బాగా చూసుకోవడం.. చెల్లి, తమ్ముళ్లను ఉన్నత చదువులకు వెళ్లేలా చూడటం నా ముందున్న ప్రధాన లక్ష్యాలు.



తరచూ ప్రమాదాలు జరిగే గువ్వలచెరువు ఘాట్‌లోని మలుపు

ప్రమాదకర మలుపులో లారీని ఓవర్‌టేక్ చేసి దూరిన బస్సు



గువ్వలచెరువు ఘాట్ రోడ్డు అంటే చాలు.. ఎవరైనా అమ్మో అంటారు. ఈ మార్గంలో చాలా జాగ్రత్తగా వాహనాలను నడపాలి. లేదంటే ప్రమాదం పొంచి ఉంటుంది. శేషాచల కొండల్లోని ఈ రోడ్డులో అనేక ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ముఖ్యంగా కడప నుంచి వెళ్లే సమయంలో ఆంజనేయస్వామి ఆలయం దాటాక ఉన్న మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. అయినా కొంతమంది వాహన డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతుంటారు. శనివారం కడప నుంచి రాయచోటి వైపు మామిడికాయల లోడుతో ఓ లారీ ప్రమాదకర మలుపు వద్ద మెల్లగా వెళుతుండగా.. రాయచోటి నుంచి ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు వచ్చింది. ఆ మలుపు వద్ద బస్ డ్రైవర్ ముందుపోతున్న లారీని ఓవర్‌టేక్ చేయడంతో పాటు ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పిస్తూ లోడు లారీకి ఎదురుగా వెళ్లాడు. అక్కడ బస్సు పట్టేంత స్థలం లేదు. కొంచెం ఏమారినా బస్సు లోయలోకి పోవాల్సిందే. దీంతో బస్సు డ్రైవర్‌పై లారీ డ్రైవర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. బస్సు డ్రైవర్ అతడిని దురుసుగా మాట్లాడ్డంతో.. లారీని ఢీకొట్టంటే తమ పరిస్థితి ఏమిటని ప్రయాణికులు సైతం డ్రైవర్‌ను ప్రశ్నించారు. చివరకు లారీని కొంచెం వెనక్కు పోనిచ్చి బస్సుకు దారి ఇచ్చాడు. గువ్వల చెరువు ఘాట్‌లో డ్రైవర్లు అప్రమత్తంగా లేకుంటే ఎలా అని ప్రయాణికులు ప్రశ్నించారు.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

ఇనగలూరులో భగ్గుమన్న పాతకక్షలు

- బైకుపై వెళ్తున్న అన్నదమ్ములను కారుతో ఢీకొట్టి.... కత్తులతో, కట్టెలతో దాడి
- ఇరువురి పరిస్థితి విషమం

పులివెందుల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలోని ఇనగలూరు గ్రామంలో పాతకక్షలు మరోసారి భగ్గుమన్నాయి. ఒక వర్గానికి చెందిన ఇరువురు బైకులో వెళ్తుండగా మరోవర్గం వారు కారుతో ఢీకొట్టి కత్తులతో, కట్టెలతో దాడి చేశారు. ఈ దాడిలో సమరసింహారెడ్డి, హరికిశోర్‌రెడ్డిలు తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించి పోలీసుల కథకం మేరకు వివరాల్లోకెళితే.... ఇనగలూరు గ్రామానికి చెందిన సమరసింహారెడ్డి, హరికిషోర్‌రెడ్డిలు శనివారం ఉదయం 9గంటల ప్రాంతంలో మోటార్‌బైకుపై పులివెందులకు బయలుదేరారు. అదేసమయంలో అదే గ్రామానికి చెందిన మరో వర్గం బాబురెడ్డి తన అనుచరులతో కారులో వీరిని అనుసరిస్తూ వచ్చారు. సైదాపురం గ్రామం దాటిన వెంటనే వెనుకవైపునుంచి కారుతో బైకును ఢీకొట్టారు. దీంతో సమరసింహారెడ్డి, హరికిశోర్ రెడ్డిలు అక్కడే పడిపోయారు. వెంటనే బాబురెడ్డి, మరికొంతమంది కారు నుంచి దిగి కత్తులు, కట్టెలతో వారిపై దాడి చేశారు. ఇంతలో సైదాపురం పొలాల్లో పనిచేసుకుంటున్న రైతులు, మరికొంతమంది కేకలువేస్తూ సంఘటన స్థలానికి వచ్చారు. దీంతో బాబురెడ్డి, ఆయన అనుచరులు కారులో పారిపోయారు. వెంటనే గాయపడ్డ ఇరువురిని పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో ఇరువురిని కడపకు రెఫర్ చేశారు. వీరిని కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. వీరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తొండూరు ఎస్‌ఐ ఘనమద్దిలేటి తెలిపారు. ఇదిలా ఉండగా జనవరి నెలలో బాబురెడ్డి వర్గానికి, సమరసింహారెడ్డి తండ్రి అయిన బాల ఓబుళ రెడ్డి కుటుంబాల మధ్య ఉపాధి బిల్లుల విషయమై గొడవ జరిగింది. ముందుగా బాబురెడ్డి వర్గీయులు, బాల ఓబుళరెడ్డి వర్గానికి చెందిన వారిపై దాడి చేశారు. ఆ దాడి అనంతరం ఫిబ్రవరి నెలలో బాల ఓబుళరెడ్డి కుమారులు వారి వర్గానికి చెందిన వారు బాబురెడ్డిపై దాడి చేశారు. అప్పటి నుంచి ఇనగలూరు గ్రామంలో పోలీసుల పికెటింగ్ ఏర్పాటు చేశారు. బాల ఓబుళరెడ్డి, సమరసింహారెడ్డి, హరికిషోర్‌రెడ్డిలను ఊరిలో ఉండవద్దని పోలీసులు హెచ్చరించడంతో వారు కొన్నిరోజుల పాటు పులివెందులలో కాపురమున్నారు. 45 రోజుల క్రితం వీరు ముగ్గురు స్వగ్రామానికి వచ్చి నివాసముంటున్నారు. అయితే ఇనగలూరు గ్రామంలో ఇప్పటికీ పోలీసుల పికెటింగ్ కొనసాగుతోంది. మళ్లీ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ఇరువర్గాలపై రౌడీషీట్ తెరిచారు. పలువురిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. అయిన ఈ దాడి జరగడం చర్చనీయాంశంగా మారింది.




సంఘటనా స్థలంలో గాయాలతో సమరసింహారెడ్డి, హరికిశోర్‌రెడ్డి

నైపుణ్యత గల యువతను తయారు చేద్దాం

- వైవీయూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని సమస్యలను పరిష్కరించే వినూత్న ఆలోచన శైలిని విద్యార్థులు అందుకునేలా కళాశాలలు తయారు కావాలని... ఆ దిశగా మనందరం ప్రయత్నిద్దామంటూ వైవీయూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ఆకాంక్షించారు. శనివారం వైవీయూలో డిగ్రీ, బీఎడ్, బీపీఎడ్, లా విద్యా సంస్థలకు అఫిలియేషన్ ప్రాసెస్ మొదలుపెట్టే ముందు ఆయా విద్యా సంస్థల యజమానులు, ప్రిన్సిపాల్స్‌తో సమావేశయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం ద్వారా ఇష్టమైన కోర్సుని ఎంపిక చేసే అవకాశాలు ఉన్న నేటి తరుణంలో విద్యార్థులకు వెంటనే ఉపాధి అవకాశాలు లభించే వాటిని డిగ్రీలో అందుబాటులోకి తేవాలన్నారు. జాతీయ విద్యా విధానం-2020 ద్వారా విద్యలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఉదహరించారు. విద్యా సంస్థల యజమానులు, ప్రధానాచార్యులు మంచి విద్యను విద్యార్థులకు అందించి జాబ్ సీకర్స్‌ని కాకుండా జాబ్ ప్రొవైడర్స్‌ని తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య కె.రఘు బాబు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



సింహాద్రిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి

సింహాద్రిపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం సెంట్రలైజ్ కిచెన్ ఏర్పాటుకు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి (నియోజకవర్గ ప్రత్యేక అధికారి) స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లా డుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసే సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఇక్కడ నుంచే మధ్యాహ్న భోజనాలు సర ఫరా చేయడం జరుగుతుందన్నారు. అన్ని పాఠశాలల విద్యార్థులకు భోజ నం ఒకే విధమైన నాణ్యత ప్రమాణాలతో అందజేస్తారన్నారు. కార్య క్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ2 శారద, ఏపీఎం మంజునాథ్, హెచ్‌ఎం సతీష్ ప్రభుకుమార్, ఎమ్ఐఎస్ కోఆర్డినేటర్ అరవింద్, తది తరులు పాల్గొన్నారు.

కర్నూలు, నెల్లూరు జట్ల విజయం

కడప స్పోర్ట్స్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కడపలో ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు గత మూడు రోజులుగా వివిధ జట్ల మధ్య సాగుతున్నాయి. మ్యాచ్‌లలో చివరిరోజైన శనివారం తమ ప్రత్యర్థి జట్లపై కర్నూలు, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. వివరాల్లోకి వెళితే...

ఏసీఏ క్రికెట్ మైదానంలో

వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో జరిగిన కడప-కర్నూలు జట్ల మధ్య సాగిన పోటీలో కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 65.3 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌట్ అయింది. కడప జట్టు 51 ఓవర్లలో 114 పరు గులకు అన్ని వికెట్లు కోల్పోయింది. దీంతో కర్నూలు జట్టుకు 43 పరుగుల మొదటి ఇన్ని ంగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 57.5 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో ఆ జట్టు 183 పరుగుల ఆధిక్యతలో నిలిచింది. విజయమే లక్ష్యంగా రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కడప జట్టు చివరిరోజైన శనివారం 39.2 ఓవర్లలో 117 పరుగులకు చేతులెత్తేసింది. కర్నూలు జట్టు బౌలర్ సాయివిఘ్నేష్ 6 వికె ట్లు పడగొట్టి కడప జట్టు ఓటమికి కారకు లయ్యారు. దీంతో కర్నూలు జట్టు 66 పరుగుల ఆధిక్యతతో విజయకేతనం ఎగురవేసింది.

కేఓఆర్ఎం మైదానంలో

కడప నగర శివారు ప్రాంత కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 59.5 ఓవర్లలో 224 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 60.2 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేసింది. దీంతో నెల్లూరు జట్టు 21 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించింది. తదుపరి రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు 63.5 ఓవర్లలో 229 పరుగులకు ఆలౌట్ అయ్యింది. బౌలింగ్ విభాగంలో అనంతపురం జట్టు బౌలర్ దేవాన్ష్ 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో రెండు ఇన్నింగ్స్‌లకు కలిపి నెల్లూరు జట్టు 250 పరుగుల ఆధిక్యత సాధించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు చివరిరోజు శనివారం ఆట ముగిసే సమయానికి 43.5 ఓవర్లలో 175 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో నెల్లూరు జట్టు 75 పరుగుల ఆధిక్యతతో విజయం సాధించింది.




సాయివిఘ్నేష్ (కర్నూలు), దేవాన్ష్ (అనంతపురం)

మద్యం మత్తులో గొంతుకోసుకున్న యువకుడు



మదనపల్లె అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో యువకుడు గొంతు కోసుకున్న సంఘటన పీటీఎం మండలంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు పీటీఎం మండలం రంగసముద్రం గ్రామం కుర్రా వాండ్ల పల్లెకు చెందిన నరసింహులు కుమారుడు నరేష్‌బాబు(26) ఫుల్‌గా మద్యం తాగి చాకుతో గొంతు కోసుకున్నాడు. రక్తం మడు గులో పడి ఉన్న యువకుని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పీటీఎం పోలీసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన తంబళ్లపల్లె మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు తంబళ్లపల్లె మండలం మొదువారిపల్లెకు చెందిన నరసింహులు భార్య రెడ్డెమ్మ (50) శనివారం కడుపు నొప్పి ఎక్కువ కావడంతో తట్టుకోలేక పురుగుల మందుతాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తర లించారు. ఇక్కడ చికత్స పొందుతుంది.

కొండయ్యగారిపల్లిలో బంగారు నగలు చోరీ

నిమ్మనపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండయ్యగారిపల్లో రెడ్డెప్పరెడ్డి, శోభారాణి దంపతుల ఇంటిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంటిలో ఉన్న చైన్‌లు, 4జతల కమ్మలు, ఇతర వస్తువుల కలిపి సుమారు 500 గ్రాములు బంగారు నగలు చోరీ అయ్యాయని పిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. చోరీ ఘటనపై బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కాగా మదనపల్లి నుంచి వేలిముద్రల నిపుణులు, క్లూస్ టీమ్‌ను రంగంలోకి దింపి దొంగలను పట్టుకునేందకు ప్రయత్నిస్తున్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

పెద్దమండ్యం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలంలో నమోదైన పోక్సో కేసులో ఓ యువకుడిని అరె స్టు చేసినట్లు ములకలచెరువు సీఐ లక్ష్మన్న వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. పెద్దమండ్యం మండలంలో ఓ బాలిక (15)పై మండల కేంద్రమైన గాలీవీడులో నివాసం వుంటున్న రామకృష్ణ (19) అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక తల్లి పెద్దమండ్యం పోలీసుస్టేషన్‌లో ఈనెల 15వ తేదీ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. సీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు వేగవంతం చేశారు. శనివారం వెలిగల్లు గ్రామ సచివాలయం సమీపంలో నిందితుడు రామకృష్ణను అరెస్టు చేసి తంబళ్లపల్లి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగప్రదేశాల్లో మద్యం తాగుతున్న 20 మందిపై కేసు నమోదు

కడప క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 20మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రెడ్డప్ప సూచనల మేరకు సిబ్బందితో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగుతున్న 20 మందిని గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తనిఖీల నివేదికలు అందజేయాలి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్) జూలై 19 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్ల, పాఠశాలల తనిఖీల నివేదికలు తక్షణం అందజేయాలని.. వాటిపై సంబంధి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో ఉన్న వసతులు తదితర అంశాల తనిఖీపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 156 సంక్షేమ హాస్టళ్లు, 2176 సంక్షేమ పాఠశాలలను నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. నీటి వసతి, మరుగుదొడ్లు, భోజనం తయారీ విధానం, తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఇప్పటికే తనిఖీ చేసిన హాస్టళ్లు, పాఠశాలలపై నివేదికలను సంబంధింత సంక్షేమశాఖ అధికారులకు అందజేయాలన్నారు. ఇప్పటి వరకు అందిన నివేదికలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా హాస్టళ్లు, పాఠశాలల్లో అత్యవసర సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాపం సాయినాథశర్మ!

- వైసీపీలోనూ మొండిచేయి

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీలో కష్టపడే వారికి పదవులు దక్కవనే ప్రచారం ఉంది. అక్కడ కేవలం రెడ్డి సామాజిక వర్గం వారికి, భజన చేసే నేతలకే పదవులు దొరుకుతాయని ఆ పార్టీనేతలే అంటూ ఉంటారు. అందుకు తగ్గట్లుగానే.. వైసీపీ శనివారం ప్రకటించిన రాష్ట్ర స్థాయి పార్టీ పదవుల్లో కొందరికి ఇచ్చిన ప్రాధాన్యం చూసి ఔరా అనుకుంటున్నారు. రెండేళ్ల క్రితం వరకు కమలాపురానికి చెందిన సాయినాథశర్మ టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. అప్పుడు వైసీపీ అధికారంలో ఉంది. జగన్ అండ్ కోకు వ్యతిరేకంగా ఈయన ఉద్యమించారు. వైసీపీ హయాంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కమలాపురంలో కొన్ని వార్డుల్లో తనవారిని గెలిపించుకున్నారు. అయితే కొన్ని రాజకీయ పరిణామాలతో ఎన్నికల ముందు ఆయన టీడీపీని వీడి వైసీపీ గూటికి చేరారు. అదే సమయంలో మైదుకూరు నియోజకవర్గం ఖాజీపేట మండలానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కూడా వైసీపీలోకి వెళ్లారు. వీరిద్దరూ ఒకేసారి వైసీపీ తీర్థ పుచ్చుకున్నారు. అప్పటి నుంచి వారు వైసీపీ కోసం పనిచేస్తున్నారు. అయితే శనివారం వైసీపీ అధిష్టానం రెడ్యం వెంకట సుబ్బారెడ్డికి రాష్ట్ర కార్యదర్శిగా పదవి ఇచ్చి పార్టీలో సముచిత స్థానం కల్పించింది. సాయినాథశర్మకు మాత్రం మొండిచేయి చూపించింది. దీన్ని ఆయన వర్గీయులు జీర్ణించుకోలేకున్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక అపూర్వం



కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

సీకేదిన్నె, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. 1996-2000 సంవత్సరంలో ఇంజనీరింగ్ పట్టభద్రులైన కేఎస్ఆర్ఎం పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాలు తర్వాత శనివారం కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకంటూ పాతజ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కళాశాలలో జరిగిన మధురక్షణాలను గుర్తుచేసుకుంటూ చిన్నపిల్లలవలే కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు. జీవితాల్లో గుర్తుండిపోయే ఇటువంటి కలయిక ఎంతో మధురానుభూతిని తెస్తుందని పూర్వ విద్యార్థులు తెలిపారు.

కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి, కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ, ప్రిన్సిపాల్ వీఎస్ఎస్మూర్తి, వైస్‌ప్రిన్సిపాల్ ప్రసాద్, డీన్ అమర్‌నాథ్‌రెడ్డి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

పులివెందుల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామ థియేటర్ పక్క సందులో నివాసముంటున్న తన భర్త దేవిరెడ్డి నీలకంఠారెడ్డి అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని అమరావతి అనే మహిళ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2020లో తమకు వివాహ మైందని.. తన భర్త, అత్త, ఆడబిడ్డ అదనపు కట్నం కోసం అనుక్షణం వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది.

ఘనంగా చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం



పుష్పాలంకరణలో చాముండేశ్వరీదేవి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వైఎంఆర్ కాలనీలోని దత్తపీఠంలో ఉన్న చాముండేశ్వరీదేవి ఆలయంలో శాఖాంబరి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, గోక్షీరాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి నూతన పట్టువస్త్రాలు, వెండి కవచాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు అనంతరం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, చండీ హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి వేద పండితులు పూర్ణాహుతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని కాయాకర్పూరం సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

తిప్పిరెడ్డిపల్లె దళితవాడలో సిమెంటు రోడ్డు ధ్వంసం

- గ్రామంలోకి దారి లేకుండా పోయిందని దళితుల ఆవేదన
- చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు

చాపాడు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామం దళితవాడలోని సిమెంటు రోడ్డును శనివారం ఉదయం కొంత మంది వ్యక్తులు ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేసినట్లు దళితులు తెలిపారు. 2019-20 సంవత్సరంలో రూ.4.50 లక్షలతో అధికారులు ఈ సిమెంటు రోడ్డును నిర్మించారు. సుమారు వంద మీటర్ల పొడవు కలిగిన ఈ రోడ్డులో 50 మీటర్ల పొడవునా సిమెంటు రోడ్డును యంత్రంతో పగులకొట్టారు. గ్రామంలోని మెయిన్‌రోడ్డు నుంచి దళితవాడలోకి వెళ్లేందుకు ఈ రోడ్డు ఉపయోగకరంగా ఉండేది. దళితవాడలో 160 కుటుంబాలవారు జీవిస్తున్నారు. సిమెంటు రోడ్డు పగులకొట్టే సమయంలో తాము ఇళ్లలో లేమని.. కూలీ పనులకు వెళ్లామన్నారు. ఈ రోడ్డు లేకపోతే గ్రామంలోకి వెళ్లలేమన్నారు. ఎస్‌ఐ చిన్నపెద్దయ్యకు దళితులు ఫిర్యాదు చేయగా... పగులకొట్టిన సిమెంటు రోడ్డును పరిశీలించారు. కాగా, తూర్పు అనంతపురం, పడ మర అనంతపురం, నక్కలదిన్నె గ్రామాలకు చెందిన 30 మంది వ్యక్తులు ఈ రోడ్డును ధ్వంసం చేసినట్లు దళితులు ఎస్ఐకి తెలిపారు. డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేసినట్లు వారు చెప్పారు.

ఈ విషయమై ఎంపీడీవో వీరకిశోర్‌ను వివరణ కోరగా.. సిమెంటు రోడ్డును పగులకొట్టిన విషయం నిజమేనన్నారు. ఏ అధికారి కూడా పగులకొట్టేందుకు అనుమతులు ఇవ్వలేదన్నారు. అక్కడున్న రోడ్డు, ఇళ్ల స్థలాల వివరాల కోసం తహసీల్దారు రమాకుమారి నుంచి సమాచారం తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



తిప్పిరెడ్డిపల్లె గ్రామ దళితవాడలో ధ్వంసం చేసిన రోడ్డు

రాజంపేట పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం

● మున్సిపల్ కమిషనర్ గోరంట్ల శ్రీనివాసులు



ముఖాముఖి

రాజంపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా చర్యలు చేపట్టి అన్ని రంగాలను అభివృద్ధి చేస్తామని రాజంపేట మున్సిపల్ కమిషనర్ గోరంట్ల శ్రీనివాసులు వెల్లడించారు. తనను కలిసిన ఆంధ్రజ్యోతితో పలు విషయాలు మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై వివరించారు.

ప్రశ్న: పట్టణ అభివృద్ధికి మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జవాబు: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. అందులో భాగంగా రాజంపేట పట్టణ అభివృద్ధికి అన్నిరకాల చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు ఏమిటి?

జవాబు: మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం. రోడ్లను వెడల్పు చేయడం, కొత్త రోడ్డును వేయడం, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, నీటిఎద్దడి లేకుండా చేయడం ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడతాం.

ప్రశ్న: అభివృద్ధి పనుల్లో జరుగుతున్న ఆటంకాలపై మీ స్పందన ఏమిటి?

జవాబు: అభివృద్ధి పనులకు నిధులు వచ్చిన వెంటనే జోరందుకుంటాయి. రాజంపేట నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ పాలకవర్గం, చైర్మన్, సభ్యులు అందరి ఆలోచన విధానానికి అనుగుణంగా పట్టణ ప్రజలకు అనువుగా అన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతాం. పట్టణంలోని 29 వార్డుల్లో సమస్యలను గుర్తించి పరిష్కరిస్తాం. పాలక మండలికి అనుగుణంగా వారి సహకారంతో అంధికారులందరం కలిసికట్టుగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తాం.

రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను అరికట్టండి

రాజంపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణం మన్నూరు ఉన్నత పాఠశాల, పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయ సమీపంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ వేసిన సిమెంటు రోడ్డు నెర్రెలు చీలి ఉండడంతో ద్విచక్ర వాహనదారుల పడిపోతున్నారు. ఈ సిమెంటు రోడ్డును సుమారు పదేళ్లకు పైబడి వేశారు. ఒక్కో వైపు సిమెంటు రోడ్డును రెండుసార్లు వేయడంతో రోడ్డు రెండుగా చీలిపోయింది. రోడ్డు రెండు భాగాలు కావడం వల్ల అందులో ద్విచక్ర వాహనదారులు వెళ్లేటప్పుడు వాహన చక్రాలు అందులో ఇరుక్కుపోయి పడిపోతున్నారు. దీనివల్ల చాలామంది గాయాలపాలయ్యారు. కేవలం 4 బస్తాల సిమెంటు రోడ్డు దెబ్బతిన్న ప్రాంతంలో వేస్తే ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారినుంచి బయట పడతారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



దెబ్బతిన్న సిమెంటు రోడ్డు
(ఇన్‌సెట్) రోడ్డు దెబ్బతిన్న ప్రాంతంలో పడిపోతున్న ద్విచక్ర వాహనదారుడు

ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందాం

● జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మధుసూదన్

రాయచోటిటౌన్, జూలై19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి స్థాయిలో నిషేధించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మధుసూదన్ పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల ఎన్నో నష్టాలు ఉన్నాయన్నారు. క్యాన్సర్‌తో పాటు హార్మోన్ సమస్యలు తలెత్తడం ద్వారా ఇతర వ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్లాస్టిక్ కవర్లు ఎక్కువగా వినియోగించడం వల్ల పర్యావరణం కలుషితం కావడమే కాకుండా మూగజీవాలు సైతం ప్లాస్టిక్ వ్యర్థాలను తిని ప్రాణాలు కోల్పోతున్నాయన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మునియానాయక్ ఎన్ఎస్ఎస్‌పీవో ఖాజా, ఎక్సైజ్ సీఐ గురుప్రసాద్, ఎస్ఐ హుస్సేన్‌బాషా విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్ధవటం : సిద్ధవటం జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి విద్యార్థులచే నిర్వహించిన ర్యాలీలో ఎంపీడీవో ఫణిరాజకుమారి మాట్లాడుతూ గ్రామంలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించామన్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి, మండల విస్తరణాధికారి మెహతాజ్‌యాస్మిన్, కార్యదర్శి దాసరి రత్నకుమార్ పాల్గొన్నారు.

నందలూరు : ఎంపీడీవో రాధాకృష్ణన్ మాట్లాడుతూ మండలంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడో శనివారం సందర్భంగా అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈవోపీఆర్డీ సునీల్‌కుమార్, కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు జడ్పీ హైస్కూల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం బుజ్జమ్మ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. తెలుగు పండింట్ పాణ్యం నారాయణ, సుధాకర్, పెంచలయ్య, శివ, శ్రీకాంత్‌బాబు పాల్గొన్నారు.

రాజంపేట: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని రాజంపేట డివిజనల్ పంచాయతీ అధికారి షేక్ మస్తాన్‌వలి పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్‌కాలని, జానీబాసాపురం ప్రాంతాల్లో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : ప్లాస్టిక్ వస్తువులను వాడరాదని అభివృద్ధి అధికారి మైథిలి పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో సుజాతమ్మ, కార్యదర్శి సుధాకర్, ఒంటిమిట్ట చెరువు సంఘం అధ్యక్షులు పాటూరు గంగిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చిట్వేలి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెల మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయం నందు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు మొక్కలు నాటాలన్నారు. ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంబది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు : 'ప్లాస్టిక్ వద్దు ఆరోగ్యమే ముద్దు' అంటూ పాఠశాలలు, కళాశాలలు, విద్యార్థులతో పాటు సచివాలయ సిబ్బందితో కలిసి శనివారం మండల కేంద్రంలో నినాదాలు చేసుకుంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో-1 గిరి వరదయ్య, ఎంఈవో-2 టి.నాగసుబ్బరాయుడు, ఏపీఎం నిరంజన్‌కుమార్, ఏపీవో మీనాకుమారి పాల్గొన్నారు.

గాలివీడు : ప్లాస్టిక్ వాడడం వల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని గాలివీడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద పేర్కొన్నారు. శనివారం ఆమె మండలంలోని ఎగువగొట్టివీ డు కస్పాలో అంగన్వాడీ సెంటర్‌లో నిర్వహించిన స్వర్ణాం ధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మధుసూదన్

డాక్టరేట్ ప్రదాన వేడుకలకు శంకర్‌కు ఆహ్వానం

ఒంటిమిట్ట / నందలూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : అమెరికన్ విస్‌డం పీస్ విశ్వవిద్యాలయం వారి డాక్టరేట్ ప్రదాన వేడుకలకు తనకు ఆహ్వానం అందినట్లు పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు పసుపులేటి శంకర్ తెలిపారు. ఈనెల 27వ తేదీ పాండిచ్చేరిలోని హోటల్ అతిథిలో జరిగే అమెరికన్ విశ్వవిద్యాలయాల డాక్టరేట్ ప్రదాన కార్యక్రమానికి తనకు ఆహ్వానం అందిందన్నారు. ఈ విశ్వవిద్యాలయానికి చెం దిన పుస్తక ఆవిష్కరణ, విభిన్న రంగాల్లో ప్రతిభ కనబరచిన వ్యక్తులకు పురస్కారాలు అందజేస్తారని ఈ సందర్భగా పేర్కొన్నారు.



పసుపులేటి శంకర్

మరమ్మతులకు నోచుకోని వీధి దీపాలు

ఓబులవారిపల్లె, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీల్లో వీధి దీపాలు ఉన్నా మరమ్మతులకు నోచుకోక చీకటి పడితే అంధకారంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడంతో ఇలా తయారైందని ప్రజలు పేర్కొంటున్నారు. కొన్ని మరమ్మతులకు గురై తొలగించగా వాటి స్థానాల్లో కొత్త విద్యుద్దీపాలు ఏర్పాటు చేయడం మరిచారని, ఎన్నిసార్లు తెలిపినా పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలు అంటే ఎంత అలుసా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ప్రసాద్‌బాబును కలిసిన సినీ హీరో అబ్బవరం కిరణ్

రాయచోటిటౌన్, జూలై19(ఆంధ్రజ్యోతి): రాయచోటి ప్రాంత వాసి, సినిమా హీరో అబ్బవరం కిరణ్ రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు అబ్బవరం కిరణ్‌కు శాలువా కప్పి సన్మానించారు.



హీరో అబ్బవరం కిరణ్‌ను సన్మానిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

రోడ్డు ప్రమాదంలో ఆవు, ఎద్దు మృతి

సిద్ధవటం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : కడప - చెన్నై జాతీయ రహదారి చాముండేశ్వరిపేట గ్రామ సమీపాన శనివారం మధ్యాహ్నం కారు ఢీకొనడంతో ఆవు, ఎద్దు మృతి చెందాయి. కారు అతివేగంగా వచ్చి ఢీకొన్న ఘటనలో నేకనాపురం గ్రామానికి చెందిన రైతులు సుబ్బారెడ్డి, రవీంద్రారెడ్డిలకు చెందిన ఆవు, ఎద్దు మృతిచెందాయి. ఎస్ఐ మహమ్మద్‌రఫి కారు డ్రైవర్ అబ్దుల్లాను ఈ సంఘటనపై విచారిస్తున్నారు.



మృతిచెందిన ఆవు

కొండ చదును చేసి భూ కబ్జాయత్నం

సిద్ధవటం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం 1, 2, 3 వార్డులు, గ్రామంలోని శాఖరాజుపల్లె రెవెన్యూ సర్వేనంబర్లు 459, 427/2, 427/1, ప్రభుత్వ డీకేటీ స్థలం సుమారు 4 ఎకరాలు కొండను చదును చేసి ఓ వ్యక్తి కబ్జాకు పాల్పడుతున్నాడు. వైసీపీకి చెందిన ఆ వ్యక్తి రాత్రివేళల్లో ఎక్సవేటర్‌తో చదును చేస్తున్నా రెవెన్యూ యంత్రాంగం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కొండ తవ్వకాలపై తహసీల్దారు తిరుమలబాబును వివరణ కోరగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ఆ వ్యక్తిపై చర్యలు తీసుకుంటామన్నారు.



అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమి

అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న

రామాపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని రాయచోటి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ పి.శ్యామ్ అన్నారు. శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ ఆధ్వర్యంలో రాయచోటివాసి, కీర్తిశేషులు సల్లా బయ్యారెడ్డి మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన భార్య సల్లా రమణమ్మ ఆర్థిక సాయంతో ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. రీజనల్ చైర్మన్ లయన్ మహమ్మద్, దాత కుమారుడు తారకేశ్వర్‌రెడ్డి, ఆశ్రమం సిబ్బంది పాల్గొన్నారు.



ప్రేమాలయంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

మార్కెట్ యార్డు చైర్మన్‌కు అభినందనలు

లక్కిరెడ్డిపల్లె, జూలై19(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్ ఎండీ షఫీ నాయక్ ఎంపిక పట్ల టీడీపీ కార్యకర్తలు, అభిమానులు శనివారం కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డుకు మైనార్టీ నాయకులకు పదవులు కట్టబెట్టడం మొదటిసారి అని పలువురు హర్షం వ్యక్తం చేశారు. యాదవ సంఘం నాయకుడు రవికుమార్, మల్లికార్జునాయుడు, వెంకటేశ్వర్లు, శంకర్, గోవిందు, వెంకటేశు, బద్రయ్య, అహ్మద్ అలీ, నరేశ్, నాని పాల్గొన్నారు.



మార్కెట్ యార్డు చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

విరూపాక్షమ్మకు మంత్రి పూజలు

చిన్నమండెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటి కోన గ్రామం బోరెడ్డిగారిపల్లెలో వెలసిన విరూపాక్షమ్మకు శనివారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పూజలు చేశారు. మంత్రి మాట్లాడుతూ విరూపాక్షమ్మ అమ్మవారు ఎంతో మహిమ గల తల్లి అని పేర్కొన్నారు.



అక్రమ నిర్మాణంపై నోటీసులు జారీ

సుండుపల్లె, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం చేస్తున్నారని నోటీసులు జారీ చేసినట్లు ఈవోపీఆర్డీ సురేశ్‌బాబు తెలిపారు. సోమవారం రాయవరం గ్రామ పంచాయతీ చీనేవాండ్లపల్లెకు చెందిన ఓ వ్యక్తి స్పందనలో ఫిర్యాదు చేయడంతో అక్రమ నిర్మాణం చేస్తున్నట్లు రెవెన్యూ అధికారుల ద్వారా తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ మేరకు ఆ స్థలం గ్రామ కంఠం అని రెవెన్యూ అధికారుల సర్వేలో తేలింది. ఆ స్థలం గ్రామ కంఠం కావడంతో ఆ నిర్మాణం గ్రామ పంచాయతీ పరిధిలోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు అది ప్రభుత్వ స్థలం అక్కడ నిర్మాణం చేయడం చట్టరీత్యా నేరమని నిర్మాణదారునికి హెచ్చరించామన్నారు. అయినా వినకుండా నిర్మాణం చేపట్టడంతో శనివారం అక్కడికి వెళ్లి మరోసారి హెచ్చరించామన్నారు. నిర్మాణం చేస్తున్న ప్రదేశంలో ఎటువంటి పట్టాలు జారీ చేయలేదని, రెవెన్యూ అధికారులు రాత పూర్వకంగా తమకు సమాచారం ఇచ్చారన్నారు. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామన్నారు. వారి ఇంటికి నోటీసును అతికించినట్లు తెలిపారు. అక్రమ నిర్మాణం ఆపకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.



గ్రామ కంఠం స్థలంలో చేపడుతున్న ఇంటి నిర్మాణం

చెత్తను పారిశుధ్య కార్మికులకు అందించాలి

రాజంపేట టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : చెత్తను నిల్వ ఉంచుకొని అందుబాటులో ఉన్న పారిశుధ్య కార్మికులకు అందించాలని, లేకుంటే సమీపంలో ఉన్న చెత్త కుండీల్లో వేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉన్నారని, దీనివల్ల పట్టణంలో ప్రతిరోజు వస్తున్న చెత్తను సేకరించేందుకు సరిపడా కార్మికులు లేకపోవడం వల్ల ఇబ్బంది కలుగుతోందన్నారు. చెత్తను రోడ్లపైన, కాలువల్లో పడవేయవద్దన్నారు. సమ్మె వల్ల కొంతమందితో మాత్రమే పారిశుధ్య పనులు చేపట్టాల్సి వచ్చిందని, కావున ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి

సిద్ధవటం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు చర్యలు తీసు కోవాలని పి.కొత్తపల్లె ప్రైమరీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారిణి రంగలక్ష్మి అన్నా రు. శనివారం ఆసుపత్రిలో ఆమె మాట్లాడుతూ డెంగ్యూ జ్వరం దోమలు కుట్టడం వల్ల వ్యాప్తి చెందుతుందని, దీని వల్ల వైరల్ ఇన్ఫెక్షన్, అధిక జ్వరం, కళ్ల మంటలు, తలనొప్పి, కీళ్లనొప్పులు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. దోమలు కుట్టకుండా రక్షణ చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు. రాత్రి వేళల్లో దోమతెర వాడాలన్నారు. ఆరోగ్య పరమైన సమస్యలు ఏవైనా ఉంటే స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించాలన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రంగలక్ష్మి

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

● వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూలై19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో రాయచోటి మండల వైసీపీ నేతలు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, 20 లక్షల ఉద్యోగాల కల్పన వంటి హామీలను అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లపు రమేశ్, ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

'అక్రమ కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం'

రాయచోటిటౌన్, జూలై19(ఆంధ్రజ్యోతి): రాజకీయ కుట్రలతో పెడుతున్న కేసులు ప్రజాస్వామ్య విలువలకు పెను ముప్పు అని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన రాయచోటి పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాజంపేట పార్లమెంట్ సభ్యుడు మిథున్‌రెడ్డిపై కుట్ర పన్నారన్నారు. మిథున్‌రెడ్డి మూడు సార్లు ఎంపీగా గెలవడం కొంత మందికి మింగుడు పడడం లేదన్నారు. పెద్దిరెడ్డి కుటుంబంపై నిరాధారణ ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు.

కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు

నందలూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలో వెలసిన కోదండరామ స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు నరసా రవికుమార్‌శర్మ ఆధ్వర్యంలో 41 రోజుల మండల పూజ మహోత్సవంలో హోమం, నవగ్రహ శాంతి, మూలవిరాట్‌నకు అభిషేకం, సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని తమ మొక్కులను తీర్చుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ధర్మకర్త గంపా సుధాకర్ మాట్లాడుతూ ఆదివారం పది గంటలకు సీతారాముల కల్యాణోత్సవం అనంతరం గ్రామోత్సవం, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు అందరూ పాల్గొనాలని కోరారు.



ఆలయంలో హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

'ప్రభుత్వ స్థలాలను అన్యాక్రాంతం చేస్తే కఠిన చర్యలు'

సిద్ధవటం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాలను అన్యాక్రాంతం చేస్తే కఠిన చర్యలు తప్పవని సిద్ధవటం తహసీల్దారు తిరుమలబాబు హెచ్చరించారు. మండల కేంద్రమైన సిద్ధవటం తహసీల్దారు కార్యాలయంలో శనివారం తిరుమలబాబు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి క్షేత్ర స్థాయిలోకి వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మండలంలో ఇప్పటివరకు 1280 మంది లబ్ధిదారులు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా సిద్ధవటం గ్రామ పంచాయతీ నుంచి 2016 దరఖాస్తులు వచ్చాయన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దారు తిరుమలబాబు

ఆలయ భూములు దురాక్రమణపై విచారణ

రామసముద్రం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆర్.నడింపల్లె పంచాయతీ బలసముద్రం సమీపంలోని వాళీశ్వరస్వామి ఆలయ భూములు దురాక్రమణకు గురైనట్లు గ్రామస్థుల ఫిర్యాదుపై జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ శనివారం విచారణ చేపట్టారు. ఆలయ భూములను కొందరు గ్రామస్థులు దురాక్రమణ చేసి ఇండ్లు నిర్మించుకున్నారని, ఎండోమెంట్‌కు ఎలాంటి రుసుం చెల్లించకుండా ఆలయ భూములు సాగుచేసుకుంటున్నారని గ్రామస్థులు వివరించారు. వాళీశ్వరస్వామి ఆలయ భూములు కొన్ని ఏడాదికి లీజు ప్రాతిపదికన కేటాయింపులు చేసినా భూములను వదలలేదన్నారు. భూదురాక్రమణ దారులకు నోటీసులు ఇచ్చి ఆలయ భూములు వదిలేయ్యాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



రాజంపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

రాజంపేట, రాజంపేట పట్టణంలో మున్సిపల్ కార్మికులు చేపడుతున్న సమ్మె కొనసాగుతుంది. శనివారం నాలుగోరోజు సమ్మెలో భాగంగా తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు జెండాలు చేతపట్టి నినాదాలు చేస్తూ తమ ఆందోళనను కొనసాగించారు. ఈ సందర్భంగా పట్టణంలోని హెల్పింగ్‌హ్యాండ్స్ ప్రతినిధులు వెంకటరమణ, చలపతి, సుబ్బరాయుడు, తదితరులు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, లక్ష్మీదేవి, ప్రసాద్, రమణ, రవిశంకర్, సాలమ్మ పాల్గొన్నారు.

ఇనగలూరులో భగ్గుమన్న పాతకక్షలు

- బైకుపై వెళ్తున్న అన్నదమ్ములను కారుతో ఢీకొట్టి.... కత్తులతో, కట్టెలతో దాడి
- ఇరువురి పరిస్థితి విషమం

పులివెందుల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలోని ఇనగలూరు గ్రామంలో పాతకక్షలు మరోసారి భగ్గుమన్నాయి. ఒక వర్గానికి చెందిన ఇరువురు బైకులో వెళ్తుండగా మరోవర్గం వారు కారుతో ఢీకొట్టి కత్తులతో, కట్టెలతో దాడి చేశారు. ఈ దాడిలో సమరసింహారెడ్డి, హరికిశోర్‌రెడ్డిలు తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించి పోలీసుల కథకం మేరకు వివరాల్లోకెళితే.... ఇనగలూరు గ్రామానికి చెందిన సమరసింహారెడ్డి, హరికిషోర్‌రెడ్డిలు శనివారం ఉదయం 9గంటల ప్రాంతంలో మోటార్‌బైకుపై పులివెందులకు బయలుదేరారు. అదేసమయంలో అదే గ్రామానికి చెందిన మరో వర్గం బాబురెడ్డి తన అనుచరులతో కారులో వీరిని అనుసరిస్తూ వచ్చారు. సైదాపురం గ్రామం దాటిన వెంటనే వెనుకవైపునుంచి కారుతో బైకును ఢీకొట్టారు. దీంతో సమరసింహారెడ్డి, హరికిశోర్ రెడ్డిలు అక్కడే పడిపోయారు. వెంటనే బాబురెడ్డి, మరికొంతమంది కారు నుంచి దిగి కత్తులు, కట్టెలతో వారిపై దాడి చేశారు. ఇంతలో సైదాపురం పొలాల్లో పనిచేసుకుంటున్న రైతులు, మరికొంతమంది కేకలువేస్తూ సంఘటన స్థలానికి వచ్చారు. దీంతో బాబురెడ్డి, ఆయన అనుచరులు కారులో పారిపోయారు. వెంటనే గాయపడ్డ ఇరువురిని పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో ఇరువురిని కడపకు రెఫర్ చేశారు. వీరిని కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. వీరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తొండూరు ఎస్‌ఐ ఘనమద్దిలేటి తెలిపారు. ఇదిలా ఉండగా జనవరి నెలలో బాబురెడ్డి వర్గానికి, సమరసింహారెడ్డి తండ్రి అయిన బాల ఓబుళరెడ్డి కుటుంబాల మధ్య ఉపాధి బిల్లుల విషయమై గొడవ జరిగింది. ముందుగా బాబురెడ్డి వర్గీయులు, బాల ఓబుళరెడ్డి వర్గానికి చెందిన వారిపై దాడి చేశారు. ఆ దాడి అనంతరం ఫిబ్రవరి నెలలో బాల ఓబుళరెడ్డి కుమారులు వారి వర్గానికి చెందిన వారు బాబురెడ్డిపై దాడి చేశారు. అప్పటి నుంచి ఇనగలూరు గ్రామంలో పోలీసుల పికెటింగ్ ఏర్పాటు చేశారు. బాల ఓబుళరెడ్డి, సమరసింహారెడ్డి, హరికిషోర్‌రెడ్డిలను ఊరిలో ఉండవద్దని పోలీసులు హెచ్చరించడంతో వారు కొన్నిరోజుల పాటు పులివెందులలో కాపురమున్నారు. 45 రోజుల క్రితం వీరు ముగ్గురు స్వగ్రామానికి వచ్చి నివాసముంటున్నారు. అయితే ఇనగలూరు గ్రామంలో ఇప్పటికీ పోలీసుల పికెటింగ్ కొనసాగుతోంది. మళ్లీ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ఇరువర్గాలపై రౌడీషీట్ తెరిచారు. పలువురిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. అయిన ఈ దాడి జరగడం చర్చనీయాంశంగా మారింది.



సంఘటనా స్థలంలో గాయాలతో సమరసింహారెడ్డి, హరికిశోర్‌రెడ్డి

నైపుణ్యత గల యువతను తయారు చేద్దాం

- వైవీయూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని సమస్యలను పరిష్కరించే వినూత్న ఆలోచన శైలిని విద్యార్థులు అందుకునేలా కళాశాలలు తయారు కావాలని... ఆ దిశగా మనందరం ప్రయత్నిద్దామంటూ వైవీయూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ఆకాంక్షించారు. శనివారం వైవీయూలో డిగ్రీ, బీఎడ్, బీపీఎడ్, లా విద్యా సంస్థలకు అఫిలియేషన్ ప్రాసెస్ మొదలుపెట్టే ముందు ఆయా విద్యా సంస్థల యజమానులు, ప్రిన్సిపాల్స్‌తో సమావేశయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం ద్వారా ఇష్టమైన కోర్సుని ఎంపిక చేసే అవకాశాలు ఉన్న నేటి తరుణంలో విద్యార్థులకు వెంటనే ఉపాధి అవకాశాలు లభించే వాటిని డిగ్రీలో అందుబాటులోకి తేవాలన్నారు. జాతీయ విద్యా విధానం-2020 ద్వారా విద్యలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఉదహరించారు. విద్యా సంస్థల యజమానులు, ప్రధానాచార్యులు మంచి విద్యను విద్యార్థులకు అందించి జాబ్ సీకర్స్‌ని కాకుండా జాబ్ ప్రొవైడర్స్‌ని తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య కె.రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు, నెల్లూరు జట్ల విజయం

కడప స్పోర్ట్స్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కడపలో ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు గత మూడు రోజులుగా వివిధ జట్ల మధ్య సాగుతున్నాయి. మ్యాచ్‌లలో చివరిరోజైన శనివారం తమ ప్రత్యర్థి జట్లపై కర్నూలు, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. వివరాల్లోకి వెళితే...

ఏసీఏ క్రికెట్ మైదానంలో

వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో జరిగిన కడప-కర్నూలు జట్ల మధ్య సాగిన పోటీలో కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 65.3 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌట్ అయింది. కడప జట్టు 51 ఓవర్లలో 114 పరు గులకు అన్ని వికెట్లు కోల్పోయింది. దీంతో కర్నూలు జట్టుకు 43 పరుగుల మొదటి ఇన్ని ంగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 57.5 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో ఆ జట్టు 183 పరుగుల ఆధిక్యతలో నిలిచింది. విజయమే లక్ష్యంగా రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కడప జట్టు చివరిరోజైన శనివారం 39.2 ఓవర్లలో 117 పరుగులకు చేతులెత్తేసింది. కర్నూలు జట్టు బౌలర్ సాయివిఘ్నేష్ 6 వికె ట్లు పడగొట్టి కడప జట్టు ఓటమికి కారకు లయ్యారు. దీంతో కర్నూలు జట్టు 66 పరుగుల ఆధిక్యతతో విజయకేతనం ఎగురవేసింది.

కేఓఆర్‌ఎం మైదానంలో

కడప నగర శివారు ప్రాంత కేఓఆర్‌ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 59.5 ఓవర్లలో 224 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 60.2 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేసింది. దీంతో నెల్లూరు జట్టు 21 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించింది. తదుపరి రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు 63.5 ఓవర్లలో 229 పరుగులకు ఆలౌట్ అయ్యింది. బౌలింగ్ విభాగంలో అనంతపురం జట్టు బౌలర్ దేవాన్ష్ 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో రెండు ఇన్నింగ్స్‌లకు కలిపి నెల్లూరు జట్టు 250 పరుగుల ఆధిక్యత సాధించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు చివరిరోజు శనివారం ఆట ముగిసే సమయానికి 43.5 ఓవర్లలో 175 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో నెల్లూరు జట్టు 75 పరుగుల ఆధిక్యతతో విజయం సాధించింది.



సాయివిఘ్నేష్ (కర్నూలు), దేవాన్ష్ (అనంతపురం)

మద్యం మత్తులో గొంతుకోసుకున్న యువకుడు



మదనపల్లె అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో యువకుడు గొంతు కోసుకున్న సంఘటన పీటీఎం మండలంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు పీటీఎం మండలం రంగసముద్రం గ్రామం కుర్రా వాండ్లపల్లెకు చెందిన నరసింహులు కుమారుడు నరేష్‌బాబు(26) ఫుల్‌గా మద్యం తాగి చాకుతో గొంతు కోసుకున్నాడు. రక్తం మడు గులో పడి ఉన్న యువకుని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పీటీఎం పోలీసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన తంబళ్లపల్లె మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు తంబళ్లపల్లె మండలం మొడువారిపల్లెకు చెందిన నరసింహులు భార్య రెడ్డెమ్మ (50) శనివారం కడుపు నొప్పి ఎక్కువ కావడంతో తట్టుకోలేక పురుగుల మందుతాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తర లించారు. ఇక్కడ చికత్స పొందుతుంది.

సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



సింహాద్రిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

సింహాద్రిపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం సెంట్ర లైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరె క్టర్ రాజ్యలక్ష్మి (నియో జకవర్గ ప్రత్యేక అధి కారి) స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లా డుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసే సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఇక్కడ నుంచే మధ్యాహ్న భోజ నాలు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అన్ని పాఠశాలల విద్యార్థులకు భోజనం ఒకే విధమైన నాణ్యత ప్రమాణాలతో అందజే స్తారన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ2 శారద, ఏపీఎం మంజునాథ్, హెచ్‌ఎం సతీష్ ప్రభుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల నివేదికలు అందజేయాలి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్) జూలై 19 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్ల, పాఠశాలల తనిఖీల నివేదికలు తక్షణం అందజేయాలని.. వాటిపై సంబంధి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో ఉన్న వసతులు తదితర అంశాల తనిఖీపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 156 సంక్షేమ హాస్టళ్లు, 2176 సంక్షేమ పాఠశాలలను నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. నీటి వసతి, మరుగుదొడ్లు, భోజనం తయారీ విధానం, తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఇప్పటికే తనిఖీ చేసిన హాస్టళ్లు, పాఠశాలలపై నివేదికలను సంబంధింత సంక్షేమశాఖ అధికారులకు అందజేయాలన్నారు. ఇప్పటి వరకు అందిన నివేదికలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా హాస్టళ్లు, పాఠశాలల్లో అత్యవసర సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక అపూర్వం



కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

సీకేదిన్నె, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. 1996-2000 సంవత్సరంలో ఇంజనీరింగ్ పట్టభద్రులైన కేఎస్‌ఆర్‌ఎం పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాలు తర్వాత శనివారం కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ పాతజ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కళాశాలలో జరిగిన మధురక్షణాలను గుర్తుచేసుకుంటూ చిన్నపిల్లలవలే కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు. జీవితాల్లో గుర్తుండిపోయే ఇటువంటి కలయిక ఎంతో మధురానుభూతిని తెస్తుందని పూర్వ విద్యార్థులు తెలిపారు.

కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి, కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ, ప్రిన్సిపాల్ వీఎస్‌ఎస్‌మూర్తి, వైస్‌ప్రిన్సిపాల్ ప్రసాద్, డీన్ అమర్‌నాథ్‌రెడ్డి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కొండయ్యగారిపల్లిలో బంగారు నగలు చోరీ

నిమ్మనపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ య్యగారి పల్లో రెడ్డెప్పరెడ్డి, శోభారాణి దంపతుల ఇంటిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంటిలో ఉన్న చైన్‌లు, 4జతల కమ్మలు, ఇతర వస్తువుల కలిపి సుమారు 500 గ్రాములు బంగారు నగలు చోరీ అయ్యాయని పిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలిం చారు. చోరీ ఘటనపై బాధితులను అడిగి వివరాలు తెలుసు కున్నారు. కాగా మదనపల్లి నుంచి వేలిముద్రల నిపుణులు, క్లూస్ టీమ్‌ను రంగంలోకి దింపి దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

పెద్దమండ్యం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలంలో నమోదైన పోక్సో కేసులో ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు ములకలచెరువు సీఐ లక్ష్మన్న వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. పెద్దమండ్యం మండలంలో ఓ బాలిక (15)పై మండల కేంద్రమైన గాలీవీడులో నివాసం వుంటున్న రామకృష్ణ (19) అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక తల్లి పెద్దమండ్యం పోలీసుస్టేషన్‌లో ఈనెల 15వ తేదీ పిర్యాదు చేసింది. ఈ మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. సీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు వేగవంతం చేశారు. శనివారం వెలిగల్లు గ్రామ సచివాలయం సమీపంలో నిందితుడు రామకృష్ణను అరెస్టు చేసి తంబళ్లపల్లి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగప్రదేశాల్లో మద్యం తాగుతున్న 20 మందిపై కేసు నమోదు

కడప క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తాలుకా పోలీసు స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 20మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రెడ్డప్ప సూచనల మేరకు సిబ్బందితో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగుతున్న 20 మంది ని గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

పులివెందుల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామ థియేటర్ పక్క సందులో నివాసముంటున్న తన భర్త దేవిరెడ్డి నీలకంఠారెడ్డి అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని అమరావతి అనే మహిళ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2020లో తమకు వివాహమైం దని.. తన భర్త, అత్త, ఆడబిడ్డ అదనపు కట్నం కోసం అనుక్షణం వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది.

తిప్పిరెడ్డిపల్లె దళితవాడలో సిమెంటు రోడ్డు ధ్వంసం

- గ్రామంలోకి దారి లేకుండా పోయిందని దళితుల ఆవేదన
- చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు

చాపాడు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామం దళితవాడలోని సిమెంటు రోడ్డును శనివారం ఉదయం కొంతమంది వ్యక్తులు ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేసినట్లు దళితులు తెలిపారు. 2019-20 సంవత్సరంలో రూ.4.50 లక్షలతో అధికారులు ఈ సిమెంటు రోడ్డును నిర్మించారు. సుమారు వంద మీటర్ల పొడవు కలిగిన ఈ రోడ్డులో 50 మీటర్ల పొడవునా సిమెంటు రోడ్డును యంత్రంతో పగులకొట్టారు. గ్రామంలోని మెయిన్‌రోడ్డు నుంచి దళితవాడలోకి వెళ్లేందుకు ఈ రోడ్డు ఉపయోగకరంగా ఉండేది. దళితవాడలో 160 కుటుంబాలవారు జీవిస్తున్నారు. సిమెంటు రోడ్డు పగులకొట్టే సమయంలో తాము ఇళ్లలో లేమని.. కూలీ పనులకు వెళ్లామన్నారు. ఈ రోడ్డు లేకపోతే గ్రామంలోకి వెళ్లలేమన్నారు. ఎస్‌ఐ చిన్నపెద్దయ్యకు దళితులు ఫిర్యాదు చేయగా... పగులకొట్టిన సిమెంటు రోడ్డును పరిశీలించారు. కాగా, తూర్పు అనంతపురం, పడ మర అనంతపురం, నక్కలదిన్నె గ్రామాలకు చెందిన 30 మంది వ్యక్తులు ఈ రోడ్డును ధ్వంసం చేసినట్లు దళితులు ఎస్‌ఐకి తెలిపారు. డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేసినట్లు వారు చెప్పారు.



తిప్పిరెడ్డిపల్లె గ్రామ దళితవాడలో ధ్వంసం చేసిన రోడ్డు

ఈ విషయమై ఎంపీడీవో వీరకిశోర్‌ను వివరణ కోరగా.. సిమెంటు రోడ్డును పగులకొట్టిన విషయం నిజమేనన్నారు. ఏ అధికారి కూడా పగులకొట్టేందుకు అనుమతులు ఇవ్వలేదన్నారు. అక్కడున్న రోడ్డు, ఇళ్ల స్థలాల వివరాల కోసం తహసీల్దారు రమాకుమారి నుంచి సమాచారం తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బ్రేక్‌ఫాస్ట్‌లో బల్లి ?

కలికిరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినుల హాస్టల్‌లో బల్లి పడిన సంఘటన కళాశాల ప్రాంగణంలో కలకం రేపుతోంది. హాస్టల్ నిర్వాహకులు, విద్యార్థినులు పరస్పర విరుద్ధ వాదనలు వినిపిస్తున్నారు. కొందరు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చలామణి చేస్తుండగా అందుకు విరుద్ధంగా మీడియాకు వేర్వేరు ఫొటోలు దొరికాయి. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ సమయంలో ఈ సంఘటన జరిగింది. ఒక విద్యార్థిని ప్లేటులో వడ్డించిన తరువాతపై నుంచి బల్లి పడ్డట్లు పరిశీలనలో తేలిందని తెలిపారు. వెంటనే అల్పాహారాన్ని మొత్తం పక్కన పెట్టించి తిరిగి అరగంటలో తయారు చేయించి వడ్డించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఒక ఫోటోలో ఒక ఇడ్లీని సగం తిన్న తరువాత బల్లి పడినట్లు స్పష్టంగా కనబడుతోంది. అయితే సామాజిక మాధ్యమాల్లో వున్న ఫొటో ఇందుకు విరుద్ధంగా వుంది. సాంబారు, చట్నీ కలబోతలో బల్లి వెల్లకిలా పడివున్నట్లు కనబడుతోంది. మొత్తానికి దీని పైన విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళన మాత్రం సాయంకాలానికి సమసిపోయింది. అదే విషయాన్ని ప్రిన్సిపాల్ కూడా ధృవీకరించారు.

బల్లి వివాదంలో మరో కోణం...

అల్పాహారంలో విద్యార్థిని కంచంలోని బల్లి కనబడిన సంఘటనపై ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు వివరణ ఇచ్చారు. ఉదయం అల్పాహారంలో బల్లి వచ్చిందని పేర్కొంటూ సగం తిన్న ఇడ్లీ వున్న ప్లేటులో బల్లి వున్న ఫొటోను ఒక విద్యార్థిని తనకు వాట్సాప్ ద్వారా పంపిందని చెప్పారు. హడావుడిగా ఇతర అధ్యాపకులతో కలిసి వెంటనే హాస్టల్ డైనింగ్ వద్దకు వెళ్ళి పరిశీలించామన్నారు. అప్పటికే అక్కడి నుంచి ఇడ్లీ ప్లేటును తొలగించినట్లు హాస్టల్ సిబ్బంది, విద్యార్థినులు తెలిపారని ప్రిన్సిపాల్ చెప్పారు. సోషల్ మీడియాలో మరో రకంగా వున్న ఫొటోను బేరీజు వేయడం కోసం విద్యార్థిని తనకు పంపిన సగం తిన్న ఇడ్లీతో వున్న ప్లేటు ఫొటోను తాజాగా పరిశీలించగా దీన్ని హాస్టల్ రూములో ఫ్లోర్‌పై పెట్టి తీసినట్లు స్పష్టంగా వుందన్నారు. హాస్టల్ డైనింగ్ నుంచి రూంకు తీసుకెళ్లి ఫొటో తీసినట్లుగా వుందన్నారు. ఇక సోషల్ మీడియాలో వున్న ఫొటో వీటన్నిటికీ విరుద్ధంగా వుందని, వాస్తవాల కోసం విచారణ చేయిస్తామని కూడా ప్రిన్సిపాల్ వెల్లడించారు.

పాడి రైతులకు అండగా పశుసంవర్ధకశాఖ



మదనపల్లె టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, వారి సమస్యలను పరిష్కరిస్తామని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మదనపల్లె వెటర్నరీ డీడీగా శనివారం బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం లంపీ స్కిన్ వ్యాధి నివారణకు పశువులకు టీకాలు వేస్తున్నామన్నారు. 75 శాతం సబ్సిడీతో పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేస్తున్నామని, రైతులకు సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ



గ్రామస్థులను విచారిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

కలకడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మే 27న నమోదైన ఎస్టీ ఎస్సీ కేసుపై రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ శనివారం విచారణ చేశారు. గుడిబండ పంచాయతీ తెట్టు గ్రామానికి చెందిన గిరిజన మహిళ ఈశ్వరమ్మను అదే గ్రామానికి చెందిన అగ్రకులస్తుడు కులం పేరుతో దూషించాడు. బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో డీఎస్పీ విచారించి వివరాలను సేకరించారు. ఎస్ఐ రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'బుద్ధుడితో నా ప్రయాణం'



నాటకంలో ఒక సన్నివేశం

మదనపల్లె, జూలై 19 (ఆంధ్రజ్యోతి): భారతీయ అంబేద్కర్ సేన సౌజన్యంతో హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ సమర్పణలో శుక్రవారం అర్ధరాత్రి దాకా సాగిన 'బుద్ధుడితో నా ప్రయాణం' డాక్టర్ అంబేద్కర్ నాటిక ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఆద్యంతం బుద్ధుని బోధనలు, త్రి శరణాలతో సభ ప్రాంగణం పరిమళించింది. 'బుద్ధునితో నా ప్రయాణం' నాటకం 18వ ప్రదర్శన స్థానిక సీఎస్ఐ జేసీఎం కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం రాత్రి విజయవంతంగా జరిగింది. బాస్ వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, జనసేన రాయలసీమ కన్వీనర్ గంగారపురాందాస్ చౌదరి, కర్ణాటక దళిత సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ మునుస్వామి, ప్రజా కవి పోతుబోలు రెడ్డెప్ప, రోజా హోటల్స్ అధినేత నాగభూషణరెడ్డి, బాస్ కేంద్ర కమిటీ సభ్యుడు కేవీ రమణ తదితరులు బుద్ధుడు - అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రారంభించారు. బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు చందు, బాస్ రాష్ట్ర నేత ముత్యాల మోహన్, బహుజన ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుమిత్ర రమణ, బాస్ నేతలు చాట్ల బయన్న, గంపల రమణ, సొన్నింటి రెడ్డెప్ప, తెట్టు శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిర్మాణం వేగం.. వసతులు మృగ్యం

- కాల్వలు లేక ఇబ్బందులు ● నేటికీ ముళ్లపొదల్లోనే ఇళ్లు
- వేయిళ్ల కాలనీలో వేయి సమస్యలు ● ఇదీ ఇందిరమ్మకాలనీ తీరు



దుర్గంధం, పొదల నడుమ నివాసాలు

వాల్మీకిపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): సీఎంగా నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి 2013లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ కాలనీ నిర్మాణంలో వేగం అందుకున్నా వసతుల కల్పనలో మృగ్యమనే చెప్పవచ్చు. 703 ఇళ్లతో మొదలైన కాలనీలో ప్రస్తుతం వెయ్యి ఇళ్లకు పైగా ఉన్నా ఇంకా ముళ్లపొదల నడుమ కాపురాలు వెళ్లదీస్తున్నారు. కాలనీ ప్రారంభంలో గొప్పగా ఆర్చి నిర్మాణం, మొదటి మూడు వరుసల్లో గృహాలకు తాగునీటి కుళాయిలు, డ్రైనేజీ రూపుదిద్దుకున్నాయి. తరువాత పైప్రాంతీయుల అవస్థలు వర్ణనాతీతమయ్యాయి. పట్టణ సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. తర్వాతి ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం కాలనీ వాసులకు శాపమనే చెప్పాలి. ప్రస్తుతం కాలనీలో కనీస వసతులు కరువయ్యాయన్న ఆవేదనలు ఎటు చూసినా దర్శనమిస్తున్నాయి. కాలనీలోని నివాసాల చెంత దుర్గంధం, పిచ్చి మొక్కల పొదల నడుమ కాపురాలు వెల్లదీస్తూ తమ బతుకులు ఇంతేనా అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లేచింది మొదలు రాత్రి పడుకునే దాకా కాలనీ వాసుల బతుకులపై విచారం వ్యక్తం చేస్తుండడం గమనార్హం. కాలనీలో కనీసం పదిరోజులకు ఒక సారి కూడా పారిశుధ్య పనులు చేపట్టక పోవడంతో నిత్యం రోగాల బారిన పడుతున్నామని, కాలనీ వాసులు వాపోతున్నారు.

అన్ని సమస్యలూ పరిష్కరిస్తాం

వాల్మీకిపురం ఇందిరమ్మ కాలనీ ప్రాంతంలో నెలకొన్న సమస్యలు అన్నీ కూడా గుర్తిస్తున్నాము. కాలనీ మొత్తం నివాసాలకు డ్రైనేజీల నిర్మాణం, వసతుల కల్పన, రోడ్లు తదితర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పనులకు సంబంధించి మంజూరు ప్రతిపాదనలు వచ్చిన తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాము. ఇందిరమ్మ కాలనీ వాసులకు అన్ని వసతులు కల్పిస్తాం.

● మనోహర్‌రాజు, ఎంపీడీఓ



మురుగు కాల్వల నిర్మాణాలు, రోడ్డు లేని ఇందిరమ్మ కాలనీ

విద్యారంగంలో నూతన మార్పులు గుర్తించాలి



ఉపాధ్యాయులకు విద్యాబోధనలో సలహాలు ఇస్తున్న ఎంఈఓ మనోహర్

పెద్దమండ్యం, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నూతన పాఠ్యాంశాల మార్పులు గుర్తించాలని ఎంఈఓలు మనోహర్, రామకృష్ణ పేర్కొన్నారు. పెద్దమండ్యం, యల్లంవారిపల్లి, కలిచెర్ల, వెలిగల్లు హైస్కూళ్లలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు క్లస్టర్ స్థాయి సమావేశాలు జరిగాయి. పెద్దమండ్యం, యల్లంవారిపల్లిలో ఎంఈఓ1, కలిచెర్ల, వెలిగల్లుల్లో ఎంఈఓ 2 పర్యవేక్షించారు. మండలంలో ఎంపికైన మోడల్ ప్రాథమిక పాఠశాల విద్యబోధనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు 'ఎ' గ్రేడ్ సాధించాలన్నారు. హెచ్‌ఎంలు భాగ్యమ్మ, మీన నాగలక్ష్మీ, విశ్వనాథ, పాల్గొన్నారు.

మార్కెట్‌కమిటీ చైర్మన్‌కు ఘన సన్మానం

మదనపల్లె, జూలై 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాంను వివిధ సంఘాల నేతలు శనివారం ఘనంగా సన్మానించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జనసేన నేత గంగారపు రామ్‌దాస్ చౌదరి సమక్షంలో కూటమి, బలిజ సంఘం నేతలు సత్కరించారు. టీడీపీ నేత గంగారపు బాబురెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నేతలు రంగస్వామినాయడు, నటశేఖర్, నారాయణస్వామి, దేవుడు రమేష్‌నాయుడు, జనసేన నేతలు నాగేంద్ర, రామ్మోహన్‌నాయుడు, పైపుల రమణ పాల్గొన్నారు. బలిజసంఘం నేతలు ఆంజనేయకుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు. శివరాంకు మార్కెట్ కమిటీలో స్థానం దక్కడంపై బలిజ కులస్థుల ఆత్మాభిమానం ఒక మెట్టు పెరిగిందన్నారు. భాస్కర్‌కుమార్, కె.కృష్ణమూర్తి, తులసీ శ్రీనివాసులు, నాగరాజు, కాకర్ల చలపతి, పద్మావతి, జంగాల శ్రీనివాసులు, లోకేష్ పాల్గొన్నారు.

ఆలయ భూముల దురాక్రమణపై విచారణ

రామసముద్రం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆర్.నడింపల్లె పంచాయతీ బలసముద్రం సమీపంలోని వాళీశ్వరస్వామి ఆలయ భూములు దురాక్రమణకు గురైనట్లు గ్రామస్తుల ఫిర్యాదుపై జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ శనివారం విచారణ చేపట్టారు. ఆలయ భూములను కొందరు గ్రామస్తులు దురాక్రమణ చేసి ఇండ్లు నిర్మించుకున్నారని, ఎండోమెంట్‌కు ఎలాంటి రుసుం చెల్లించకుండా ఆలయ భూములు సాగుచేసుకుంటున్నారని గ్రామస్తులు వివరించారు. గత మహాశివరాత్రి సందర్భంగా ఏర్పడిన వాళీశ్వరస్వామి ఆలయ భూములు కొన్ని ఏడాదికి లీజు ప్రాతిపదికన కేటాయింపులు చేసినా దురాక్రమణ దారులు భూములను వదలలేదని వివరించారు దీంతో ఎండోమెంట్ అధికారి భూదురాక్రమణ దారులకు నోటీసులు ఇచ్చి ఆలయ భూములు వదిలేయ్యాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈఓ రమణ, ఇన్‌స్పెక్టర్ శశికుమార్, వీఆర్వో సాయి, సర్వేయర్ తేజు పాల్గొన్నారు.

రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలి



నర్సరీ యజమానులకు నోటీసులు అందజేస్తున్న హెచ్ఓ ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి

గుర్రంకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు చేసే టమోటా, వంగ, మిరప, చామంతి, పూల మొక్కలకు నర్సరీ యజమానులు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలని వాల్మీకిపురం ఉద్యానవన అధికారి ఈశ్వర్‌ప్రసాద్ రెడ్డి సూచించారు. మార్కెట్‌యార్డు, ఇందిరమ్మ కాలనీ, గాలివీడు మార్గాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ నర్సరీ నిర్వాహకులు నిబంధనలను పాటించాలని తెలిపారు. నర్సరీ లైసెన్స్‌ల కాల పరిమితి అయిపోయిన వారు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ప్రతి నర్సరీ యజమాని విత్తన కొనుగోలు, మొక్కల సరఫరా రిజిస్టర్, సస్యరక్షణ చర్యల రిజిస్టర్లను తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. నర్సరీ యజమానులకు నోటీసులు అందజేశారు.

నృసింహుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి

గుర్రంకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామికి పూజలు



వాల్మీకిపురం, జూలై 19(ఆంధ్ర జ్యోతి): కోనేటి వీధిలో వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం విశేష కార్యక్రమాలు జరిగాయి. ఉదయం సుప్రభాత పూజ, ఆలయంలోని అయ్యప్ప స్వామి, సుబ్రహ్మణ్యస్వామి, వినాయకమూర్తులకు పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకాలంకరణలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం పడి పూజ చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గురుస్వాములు టమోటా రామచంద్ర, శేఖర్, శీనాస్వామి, భక్తులు పాల్గొన్నారు.


నేడు ఆడికృత్తిక వేడుకలు

వాల్మీకిపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూహాలయంలో ఆదివారం షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకులు శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. ఉదయం నుంచి ఆలయంలో అభిషేకాలు, విశేష పూజలు, సాయంత్రం శ్రీవల్లీదేవసేన సమేత కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు.

నేడు గంగజాతర్లు

వాల్మీకిపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మవార్ల ఆలయాల్లో ఆదివారం జాతర మహోత్సవాలు నిర్వహించనున్నారు. పట్టణంలోని బోయకొండ గంగమ్మ, లాభాల గంగమ్మ, శక్తిమాత అమ్మవారు దేవాలయాల్లో ఉదయం నుంచి విశేష పూజలు, అమ్మవారికి దీలుబోనాలు సమర్పణ అన్నదానాలు జరగనున్నాయి.

చంద్రబాబును కలిసిన మాజీ ఎమ్మెల్యే శంకర్



బాబును కలిసిన శంకర్‌యాదవ్

మదనపల్లె, జూలై 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును శనివారం తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ కలిశారు. తిరుపతిలో పర్యటించిన ముఖ్యమంత్రిని కలిసిన ఆయన నియోజకవర్గ సమస్యలు, ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. 30, 31వతేదీల్లో బెంగళూరులో జరిగే కుమారుడు శ్రీకాంత్ పెళ్లికి రావాలని కోరారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపేద్దాం

- స్వచ్ఛ ఆంధ్ర పరిరక్షణకు కృషి చేయాలి ● పరిశుభ్రతతో రోగాలు దూరం
- స్వచ్ఛాంధ్ర స్వచ్ఛదివస్‌లో ప్రతిజ్ఞ చేయించిన అధికారులు



కలకడ బస్‌స్టాండ్ వద్ద అధికారులు, నేతల మానవహారం - చింతపర్తిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

మదనపల్లె/మదనపల్లె టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి ప్రమాదకరమైన ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపేద్దామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. శనివారం రామారావు పాఠశాల వద్ద మున్సిపల్ కమిషనర్ ప్రమీల ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో ఆయన మాట్లాడుతూ తక్కువ మైక్రాన్ ప్రమాణికాలు వుండే ప్లాస్టిక్‌ను ఉపయోగిస్తే క్యాన్సర్ వస్తుందన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మాణం కోసం కృషి చేస్తామని ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు.

స్వచ్ఛ ఆంధ్ర పరిరక్షణకు కృషి చేయాలి

స్వచ్ఛ ఆంధ్ర పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్వేత పేర్కొన్నారు. చీకిలగుట్ట వద్ద స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్రలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం వద్ద పరిసరాలు శుభ్రం చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి ఆధ్వర్యంలో విద్యార్థులు నాటకం ప్రదర్శించారు. ప్రభుత్వాస్పత్రి వద్ద ఎన్‌జీఆర్ ఒకేషనల్ కళాశాల కరెస్పాండెంట్ ఎన్‌జీ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు పిచ్చి మొక్కలను తొలగించి, బ్లీచింగ్ చల్లారు. కురవంకలోని ఎన్‌జీఆర్ కళాశాల విద్యార్థులు కళాశాల నుంచి కదిరి రోడ్డు మీదుగా ర్యాలీగా జిల్లా ఆస్పత్రికి చేరుకుని అక్కడ చెత్తను శుభ్రం చేశారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి అవగాహన కల్పించారు. ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం అనీబిసెంట్ సర్కిల్, సొసైటీకాలనీ మీదుగా ర్యాలీగా కళాశాల చేరుకున్నారు. ప్రిన్సిపాల్ ఎన్.జి. రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



మదనపల్లెలో ప్రభుత్వాస్పత్రి పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్‌జీఆర్ కళాశాల విద్యార్థులు

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి

పెద్దమండ్యం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం కోసం ప్రజలు ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించాలని ఎంపీడీఓ శ్రీధర్‌రావు కోరారు. మండలంలో ర్యాలీలు, శుభ్రతపై అవగాహన చేపట్టారు. పెద్దమండ్యం, కలిచెర్లలోని దుకాణాల వద్ద ప్లాస్టిక్ వాడకంతో అనారోగ్య సమస్యల గురించి ఎంపీడీఓ ప్రజలకు వివరించారు. తహసీల్దార్ తేజస్వి, ఎంఈఓలు మనోహర్, అక్తర్ ఇమ్మానుయేల్, అధికారులు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు

నిమ్మనపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని మండల అధికారులు బస్‌స్టాండులో మానవహారం చేపట్టారు. ఎంపీడీఓ రమేష్, హెచ్‌ఎం అంజాద్, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, ఉపాధ్యాయులు గోపాల్, భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం...

కురబలకోట, జూలై 19(ఆంధ్రజ్యోతి): శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని ఎంపీడీఓ గంగయ్య అన్నారు. శనివారం కురబలకోటలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. శుభ్రతను పాటించడం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా మొక్కలను పెంచి ప్లాస్టిక్‌ను నివారించాలన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం..

పెద్దతిప్పసముద్రం జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను నివారించి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎంపీడీఓ తహసీల్దార్ శ్రీరాములు నాయక్ వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాను సారం ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర స్వచ్ఛదివస్ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య, వెలుగు సిబ్బంది, పంచాయతీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. బస్‌స్టాండు కూడలిలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఎంఈఓ నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలచంద్రాచారి, అధికారులు, నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



తరిగొండలో మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి చెప్పండి

పీలేరు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి చెప్పాలని పీలేరు మండల ప్రత్యేకాధికారి, జిల్లా పరిశ్రమల అధికారి క్రిష్ణకిషోర్ తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి అధ్యక్షతన స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర సమావేశం నిర్వహించారు. సమావేశంలో పీలేరు ఏఎంసీ చైర్మెన్ పురం రామ్మూర్తి, ఎంపీడీఓ శివశంకర్, డిప్యూటీ ఎంపీడీఓ లతీఫ్‌ఖాన్, కార్యదర్శులు జ్ఞానశేఖర్, శివాజీ, సాహీన, అలీఫ పాల్గొన్నారు.

శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



కలికిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

వాల్మీకిపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): మన పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీఓ మనోహర్‌రాజు అన్నారు. చింతపర్తి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు పుర వీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్‌స్టాండ్ కూడలి వద్ద మానవహారం ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. మండల స్పెషలాఫీసర్ లక్ష్మీప్రసన్న, సర్పంచ్ మహిత, డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, నేతలు పారిశుధ్య కార్మికులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

పారిశుధ్యంతో రోగాలు దూరం

గుర్రంకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రజలు శుభ్రతను పాటించడంతో మంచి ఆరోగ్యం పొందవచ్చని మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ నౌషాద్‌అలీ అన్నారు. గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో సచివాలయం నుంచి బస్‌స్టాండు వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



నల్లకవర్ల వాడకాన్ని నిషేధించాలని పీలేరులో నిర్వహిస్తున్న ర్యాలీ

కలకడ, జూలై 19(ఆంధ్రజ్యోతి): మానవాళికి రక్షణ కవచమైన పర్యావరణాన్ని కాపాడుకుందామని మండల ప్రత్యేకాధికారి దయాకర్‌రెడ్డి అన్నారు. అధికారులు, నేతలు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈఓ మునీంద్రనాయక్, ఏపీఎం పురుషోత్తంరెడ్డి, కార్యదర్శులు శైలజ, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో స్వచ్ఛాంధ్ర

కలికిరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలుచోట్ల పారిశుధ్యం, పరిసరాల శుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించడం కోసం అధికారులు ర్యాలీ చేపట్టారు. విద్యార్థులచే ప్రతిజ్ఞలు చేయించారు. ఎంపీడీఓ భానుమూర్తి రావు, డిప్యూటీ ఎంపీడీఓ మహ్మద్ రియాజుద్దీన్, కలికిరి కార్యదర్శి అశోక్, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేష్ రెడ్డి, పలువురు మండల అధికారులు, గ్రామ స్థాయిలో సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వైద్యులకు ఏఐ ప్రత్యామ్నాయం కాలేదు

మదనపల్లె టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ప్రచారంలో వున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఎన్నో ఉపయోగాలు వున్నా, వైద్యుల సేవలకు సరిరాదని అప్న అధ్యక్షుడు డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఏఐ భారత్ ఉత్సవ్ 2025 లో ఆయన మాట్లాడుతూ ఏఐ ద్వారా ఉపయోగాలతో పాటు, నష్టాలు కూడా వున్నాయన్నారు. ఏఐని సక్రమంగా వినియోగించిన నాడే అన్ని విధాలా ప్రయోజనం వుంటుందన్నారు.

ఈ-కామర్స్‌పై పట్టుసాధించాలి

మదనపల్లె టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): డిగ్రీలో బీకాం విద్యార్థులు ఈ-కామర్స్‌పై పట్టు సాధిచాలని ఐసీటీ(ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ) టెక్నికల్ లీడర్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో బీకాం విద్యార్థులకు ఈ-కామర్స్‌పై శిక్షణ ప్రారంభించారు. ఆటోస్ ప్రయాస్ యూత్ ఎంపవర్‌మెంట్ ద్వారా 150 మంది విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలో 65 మంది శిక్షణకు ఎంపికయ్యారన్నారు. వీరికి శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కళాశాల కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రమ్య, ట్రైనర్ భువనేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి కేసులో నలుగురి అరెస్ట్

బి.కొత్తకోట, జూలై 19(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు అమరనాథ్ నివాసంపై దాడి చేసిన ఘటనలో నిందితులను అరెస్ట్ చేసి రిమాం డుకు తరలించినట్లు సీఐ జీవన్‌గంగానాథబాబు తెలిపారు. కనకంటిమహేష్, మారెకనమ సురేష్‌యాదవ్, ఏసుబాబు, ఇడగొట్టి వినోద్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.